# కళ్ళేపల్లి తిరుణాళ్ళ

కళ్ళేపల్లి తిరుణాళ్ళను పురస్కరించుకుని ఈవ్యాసంలో హాస్యోద్దీపనం కోసం వ్యాసకర్త క్రోడీకరించిన ఘట్టాలన్నీ ఇతర తిరుణాళ్ళకున్ను చెందుతాయి. మనతీర్థాలు వాటి ఆంతర్యాన్ని కోలుపోయి అవినీతికి ఆస్కారాలై వున్నాయి. అవి సంస్కరణాన్ని కోరుతున్నాయి. ఇట్టి వ్యాసాలు అట్టిపనిని కొంతవరకు చేయగలవు. —సంపాదకుడు.

రచయిత:

## అలంపురం రాజు, బి. యే.

నాకు అందంగా వ్యాసం వ్రాయడం చేతకాదు. ఇదివరలో న్యూస్ పేపరు రిపోర్టరుగా ఉండేవాడ్ని. ఏదోవిధంగా తనుపేర్లు పేపర్లో పడితే అందలం ఎక్కినట్లు అఘోరించే సన్యాసులు బ్రతిమాలితే మొగమాటాన్ని వాళ్లు దేశనాయకుల్లాగ పనిచేస్తున్నారని వ్రాశాను. నిజానికి వాళ్ళు విగ్రహాల్లాగ కూర్చున్నచోటునుంచి కదలనిరకం. ఇది సంపాదకునకు తెలిసిన మర్నాడు నాఉద్యోగం మన్నుగలసింది. బుద్ధి తెచ్చుకుని ఈ తిరణాల విశేషాలు ఉన్నవున్నట్టు వ్రాస్తున్నాను. ఏసంపాదకుడయినా నాలో 'మెరిట్' గ్రహించక పోతాడా అని.

* * *

పతివ్రతలకు అత్తారింటికి వెళ్ళటం సరదా. బహుపతివ్రతలకు—అంటే అనేకమంది పతులకు సహాయపడవలెననే వ్రతంకలవాళ్ళకు పుట్టింటికయితే సరదా. ఈరెంటిని మించిన సరదా వెధవముండలకి తిరుణాలంటేను.

సంతనాడు మిఠాయివాడి చేతిలో జీళ్ళపాకం ఎలాసాగుతుందో శివరాత్రికి కళ్ళేపల్లి తిరుణాలు అలాసాగుతాయి. ఇంకా ఎన్నో జనసామాన్యాన్ని ఆకర్షిస్తాయి.

* * *

తిరుణాలకొచ్చినవాళ్ళలో మగవాళ్ళు 3 పాళ్ళు, ఆడవాళ్ళు 5 పాళ్ళు: ఆడాళ్ళలో కురిడీసరుకు 12 పాళ్లు, మిగతాసరుకు 4 పాళ్లు.

తమభర్తలుకూడా ఉండి సాయంఉన్నారని సంతోషించినవాళ్ళు 2 పాళ్లు, తమస్వతంత్రానికి అడ్డుకలుగజేశారని పరితపించిన వాళ్ళు 10 పాళ్ళు.

ఆడవాళ్ళు ఖర్చుపెట్టిన డబ్బులో భర్తలిచ్చినది 2 పాళ్ళు, పైవాళ్ళిచ్చింది 10 పాళ్ళు, అత్తకు తెలియకుండా బియ్యం అమ్ముకుని ప్రోగుచేసుకున్నది 6 పాళ్ళు.

సముద్రం పోటుమీద ఉన్న మూలాన్ని స్నానోదకంలో కృష్ణజలం 1 పాలు, సముద్రజలం 6 పాళ్ళు. స్నానంచెయ్యడంవల్ల పోయిన పాపం 3 పాళ్ళు—ఒంటికంటుకున్న ఉప్పు 5 పాళ్ళు, బురద 15 పాళ్ళు

స్నానంచేశేటప్పుడు తూర్పు దిక్కుకుతిరిగి మునిగినవాళ్ళు 3 పాళ్ళు, అందమైన ఆడవాళ్ళవంక తిరిగి మునిగినవాళ్ళు 6 పాళ్ళు.

నీటికాసులట్టిన బ్రాహ్మల్లో మంత్రాలు చదువుకున్నవాళ్లు 13 పాళ్ళు, బియ్యే చదువుకున్నవాళ్ళు 2 పాళ్ళు, కమ్మ బ్రాహ్మలు వగైరా 1 పాలు.

స్కూలు కుర్రాళ్ళలో స్నానం చేద్దామని వచ్చినవాళ్ళు 2 పాళ్ళు. పలుచని చీరకట్టుకుని స్నానంచేసే పడుచు పిల్లల శరీరసౌందర్యం చూద్దామని వచ్చినవాళ్లు 14 పాళ్లు.

దుకాణాల్లో అమ్మిన మిఠాయి తాజాసరుకు 5 పాళ్లు, బందరు తిరణాల్లో మిగిలింది 7 పాళ్ళు, నిరుటి శివరాత్రిది 4 పాళ్ళు. మిఠాయి సరుకులో బెల్లం 9 పాళ్ళు, శనగపిండి 3 పాళ్ళు, చీమలు 1 న్నర పాలు, బూజు 1 పాలు.

కాఫీ డికాక్షనుకు ఉపయోగించింది గింజలపొడి 3 పాళ్ళు, డబ్బాపొడి 8 పాళ్ళు, రోడ్డుబూడిద 5 పాళ్ళు.

గర్భగుళ్ళోకి పళ్ళెట్టుకెళ్ళే ఆడాళ్ళకు ముందుతోపులు 3 పాళ్ళు, వెనుకతోపులు 7 పాళ్ళు, ప్రక్కతోపులు 10 పాళ్ళు.

* * *

తిరణాల్లో ప్రజలు అనేక విషయాల్నిగురించి అనేక విధాలుగా మాట్లాడుకున్నారు. వాట్లో కొన్ని పొందుపరుస్తాను.

ఒకడు—శివరాత్రి అని ఎందుకంటారురా ?

మరొకడు—గౌరీశంకరుల గర్భాదానంరాత్రి గనుక!

ఒకడు—నీ కెలా తెలుసు ?

మరొకడు—సీతారాములు ఒకరి ప్రక్క నొకరుంటారు. అది పట్టాభిషేకం. గౌరిమీద శివలింగం ఉంటుంది. ఇది గర్భాదానం.

ఒకడు—శివరాత్రికి రాత్రివేళ నిద్రపోగూడదంటూ రెంచేత?

మరొకడు—వాళ్ళిద్దరూ ఆగర్భాదానంనాడు నిద్రపోలేదట.

* * *

కొడుకు—నాన్నా, మాంమాష్టరు గారు స్త్రీలింగం పుల్లింగం మాట చెప్పారుగాని శివలింగం మాట చెప్పలేదే?

తండ్రి—ఇది ఆరకం లింగంకాదు

* * *

ఒకడు—ఒంటరిగా ఎక్కడి కెడతావమ్మా?

ఒకతె—మా ఊళ్ళోళ్ళున్నచోటికి.

ఒకడు—మీ ఊళ్ళోళ్ళున్నారుగాని మీఆయన లేడన్నమాట. రాత్రి యిద్దరం కబుర్లు చెప్పుకుంటూ జాగారంచేద్దామా?

ఒకతె—ఎదవ చచ్చినోడ!

* * *

ఒకడు—బందరులో లవకుశ టాకీ చూశావురా?

మరొకడు—లవకుశ చూడలేదు కాని కుశలవ చూశాను. మా వూళ్లో నాటకంవేశారు.

ఒకడు—అసలు ఏదయినా సినీమాచూచావా?

మరొకడు—చూడకేం? మొన్న నే దొర్ల చీనీమా చూచాను. అందులో ఆదొరసానుల ఆ ఒళ్ళు-ఆకళ్ళు-ఆపళ్ళు-చూస్తే-అబ్బ-లేచి నుంచునీదిరా ప్రతీ యెంటికీని.'

* * *

ఒకడు—రాత్రి శ్రీకృష్ణ రాయబారం నాటకానికొస్తావా. బందరాళ్ళు వేస్తున్నారు.

మరొకడు—మొన్న సు శాస్త్రుల్లుగారు బాగోతంచెబుతూంటే విన్నాను. ఉంచుకోటానికి 4 గురు గోపికల్ని యిమ్మని కుట్టమూర్తిని నారదుడు అడిగాడంట. ఆగోపికలకీ నారదుడికీ ఏమయినా రాయబారం చేశాడేంటి కుట్టమూర్తి?

* * *

ఒకావిడ ఉపవాసముండి అన్నం మెతుకు ముట్టకుండా సాయంత్రం వేళ సవాసేరు మిఠాయి, ఒక అరటిపళ్ళ త్తం, యింటినుండి తెచ్చిన రెండు చిమ్మిలుండలు, అర్ధణా వేరుశనక్కాయలు తిని చెంబుడునీళ్ళు త్రాగింది. రాత్రి జాగారంచేసింది. తెల్లారేసరికి అజీర్తివిరేచనాలు లకించుకున్నాయి. దానితోపాటు రెండు వాంతులయినయ్.

కలరాఅంటే కలరా అన్నారు. ఆవెడ స్పృహతప్పి పడిపోయింది. ఆమె బంధువులెవళ్ళూ లేరు. ఇరుగుపొరుగువాళ్ళతో వచ్చింది. వాళ్ళు మిగతావాళ్ళతోపాటు భయపడి తోకముడిచి యింటికి త్రోవతీశారు. అంతా చూచాను. బలేసమయం అనుకున్నాను. గభాలున ఆవెడమీద వాలేను.

'అయ్ నాపెళ్లామో! అయ్ నాపెళ్లామా! ఎంతపనిచేశావే!' అంటూ ఆవిడ్ని కౌగలించుకుని ఏడవటంమొదలెట్టాను. కాస్సేపేడ్చి, మెడలోఉన్న కాసులపేరు, చెవులదుద్దులు, చేతిగాజులుతీసుకుని జేబులో వేశాను.

రవిక జేబులో ఏమున్నా డబ్బుంటుందేమోనని తడిమాను. గుండె కొట్టుకొంటున్నట్టు గోచరించింది. నాగుండె లటుక్కుమంది. దొరికిపోయాననినాకునిజంగాఏడుపువచ్చింది.

గభాలునలేచి 'కలరావచ్చిందని ఎవరూ దగ్గరకురారంటే, ఎంతగతిపట్టిందే, బండితోలుకొస్తానే, మీఅమ్మదగ్గరకు తీసుకెడతానే అయ్ నాపెళ్లామో! అయ్ నాపెళ్లామా!' అంటూ ఏడుస్తూ యివతలికొచ్చాను. ఆరావడం రావడం బందరొచ్చేవరకు వెనక్కితిరిగి చూడలేదు.